క్లుప్తంగా

కనులపండువగా సీతారాములు కల్యాణం



పూజలు నిర్వహిస్తున్న ప్రతాప్‌రెడ్డి తదితరులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీకోదండ రామచంద్ర స్వామి(రామునిబండ) ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు వారికి తీర్థప్రసాదాలు అందించారు. అలాగే కాంగ్రెస్ యూత్ నాయకుడు భానుప్రకాశ్‌రావు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌కుమార్, ఎంపీటీసీ కిరణ్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

కష్టపడిన కార్యకర్తలకు ప్రాధాన్యమివ్వాలి



దీప్‌దాస్‌మున్షీకి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్‌పార్టీ గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రధాన్యతనివ్వాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో దీప్‌దాస్‌మున్షీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడే నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణ, సంతోష్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

జైన చౌముఖి శిల్పానికి పూజలు



పూజలు చేస్తున్న గ్రామస్తులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలోని అంగడి వీరన్న ఆలయం సమీపంలోని వ్యవసాయ భూమిలో ఇటీవల 10వ శతబ్దానికి చెందిన చాళుక్యుల కాలంనాటి జైన చౌముఖి శిల్పం లభ్యమయింది. దీంతో గ్రామస్తులు సోమవారం ఆ శి ల్పాన్ని అంగడి వీరన్న ఆలయానికి చేర్చారు. ఈ సందర్భంగా అర్చకులు పార్నంది ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు జైన చౌముఖి శిల్పానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వృద్ధుడి అదృశ్యం



దుబ్బాకటౌన్: వృద్ధుడు అదృశ్యమైన ఘటన దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్‌లో చోటుచేసుకుంది. సోమవారం దౌల్తాబాద్ ఎస్‌ఐ ప్రేమ్‌దీప్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన 54 యేళ్ల బాయికాడి లక్ష్మణ్ గత 15న పొలానికి వెళ్లివస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. వృద్ధుడి కొడుకు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి మృతి



అక్కన్నపేట (హుస్నాబాద్): మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన వెల్దండి శ్రీకాంత్(35) కోహెడ మండలంలోని పోరేడుపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని నెలలుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు.

నేడు ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వాతినక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు భార్గవ లక్ష్మీనరసింహస్వామి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అంబులెన్స్ కలేనా?

- ఆవేదన వ్యక్తం చేస్తున్న అక్కన్నపేట ప్రజలు
- అత్యవసర సమయాల్లో ఇబ్బందులు
- పట్టించుకోని వైద్యశాఖ అధికారులు
- అందరి ఆశలు మంత్రి పొన్నంపైనే



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అంబులెన్స్‌లు ఎందరికో ప్రాణదాతలు. ప్రమాదాలబారిన పడినా, అత్యవసరంగా అనారోగ్యానికి గురైనా అక్కున చేర్చుకుని హుటాహుటిన ఆస్పత్రికి తరలిస్తాయి. కాని చాలా గ్రామాలు, తండాలకు ఇంకా అంబులెన్స్ సర్వీసులు అందుబాటులోకి రావడంలేదు. దీంతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతకాల్సి వస్తోంది. అత్యవసర సమయాల్లో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. అలాంటి మండలాల్లో అక్కన్నపేట ఒకటి. ఈ మండలానికి 108అంబులెన్స్ కలేనా అనే ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి. ఇక మంత్రి పొన్నం ప్రభాకరే మాకు దిక్కంటూ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

– అక్కన్నపేట(హుస్నాబాద్)

అక్కన్నపేట మండల కేంద్రంగా ఏర్పాటై దాదాపు ఎనిమిదేళ్లు దాటుతున్నా అంబులెన్స్ మాత్రం అందుబాటులోకి రాలేదు. మండలంలో 31గ్రామాలు ఉండగా సుమారు 32వేల జనాభా నివసిస్తున్నారు. అక్కన్నపేట, రామవరం గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఈ రెండింటి పరిధిలో 8సబ్ సెంటర్లు ఉన్నాయి.

గాలిలో ప్రాణాలు..

మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ మూలమలుపు వద్ద తరుచూ ప్రమాదాలు సంభవిస్తుంటాయి. అలాగే శివారు ప్రాంతంలో కూడా ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇటీవల మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి పాముకాటుకు గురై అంబులెన్స్ లేక సకాలంలో చికిత్స అందలేదు. దీంతో ఆయన ప్రాణాలను కోల్పోయాడు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగినప్పుడల్లా సమయానికి అంబులెన్స్ అందుబాటులో లేక చాలామంది ప్రాణాలను కోల్పోతున్నారు. అంబులెన్స్ కావాలంటూ అనేకసార్లు వివిధ పార్టీల నాయకులు గతంలో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అయినా ఫలితం లేదంటూ స్థానికులు వాపోతున్నారు.

60కిపైగా తండాలు

ఉన్న రెండు ఆరోగ్య కేంద్రాల పరిధిలో సుమారు 60కిపైగా గిరిజన తండాలు ఉన్నాయి. ఇంకా అనేక మారుమూల పల్లెలు కూడా ఉన్నాయి. గ్రామాలకు దూరంగా గుట్టల నడుమ తండాలు ఉండడంతో ప్రమాదాలు జరిగే సమయంలో అంబులెన్స్ కోసం వాళ్లంతా పడరానిపాట్లు పడుతున్నారు. ప్రైవేటు వాహనంలో ఆసుపత్రికి తరలించే క్రమంలో గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా స్థానిక రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టిసారించి వెంటనే అంబులెన్స్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి



అక్కన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108అంబులెన్స్ అందుబాటులో లేక చాలా మంది ప్రాణాలను కోల్పోతున్నారు. గ్రామీణ ప్రాంతాలు, గిరిజనతండాలు అధికంగా ఉన్నాయి. ప్రతిరోజు ఏదో ఒకచోట ప్రమాదాలు సంభవిస్తాయి. అలాగే గర్భిణులకూడా తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలి.

– పెసరు సాంబరాజు, ఎంపీటీసీ సభ్యుడు, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు అక్కన్నపేట

ఎట్టకేలకు 'మార్కెట్ కమిటీ'?

- తొమ్మిదేళ్లుగా నియామకం వాయిదా
- శ్రీనివాస్‌రెడ్డికి చైర్మన్ పదవి దక్కే అవకాశం



కొండపాక మార్కెట్ కమిటీ భవనం

కొండపాక(గజ్వేల్): మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం ఎట్టకేలకు ఓ కొలిక్కివస్తున్నట్టు సమాచారం. తొమ్మిదేళ్లుగా కమిటీ నియామకం లేకపోవడంతో చాలా మంది ఆశావహులు తీవ్రంగా ప్రయత్నించి నిరాశతో మిన్నకుండిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నికార్పొరేషన్ కమిటీలను ఏర్పాటు చేస్తామన్న ప్రకటన మళ్లీ ఆశావహుల్లో ఉత్సాహం రేకెత్తింది. మార్కెట్ చైర్మన్ పదవి జనరల్ కోటాకు రిజర్వుచేశారు. దీంతో ఉమ్మడి కొండపాక మండలంలోని మేదినీపూర్ గ్రామానికి చెందిన విరుపాక శ్రీనివాస్‌రెడ్డికి చైర్మన్ పదవి దాదాపుగా ఖరారైనట్లుగా తెలిసింది. ఆయన తొమ్మిదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం పనిచేస్తూ ఉమ్మడి కొండపాక మండల అధ్యక్షుడుగా కొనసాగుతున్నారు. అయితే వైస్ చైర్మన్ పదవికి 8మంది పోటీపడుతున్నట్టు సమాచారం. ఏదేమైనా వారంరోజుల్లో పూర్తిస్థాయిలో పాలకవర్గం కొలువుదీరుతుందన్న ప్రచారం సాగుతోంది. ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో మూడెకరాల ప్రభుత్వ స్థలంలో రూ.3.70కోట్లతో 5వేల మెట్రిక్‌టన్నుల సామర్థ్యంగల గోదాంతో



పాటు మోడల్ కార్యాలయ భవనాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించింది. మార్కెట్ కమిటీ చైర్మన్ పదివికి చాలా మంది పోటీ పడడంతో తొమ్మిదేళ్లుగా వాయిదా పడుతూ వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌కమిటీ కార్యాలయాన్ని ఎన్నికల నిర్వహణ సామగ్రిని భద్రపర్చేందుకు వినియోగిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం పూర్తయితే తమకు మేలుజరిగే అవకాశం ఉందని రైతులు ఎదురుచూస్తున్నారు.

మార్కెట్ కమిటీలో పదవుల స్థానాలు

మార్కెట్ కమిటీలో చైర్మన్ పదవితోపాటు వైస్ చైర్మన్ పదవి, 10 మంది డైరెక్టర్లు, ఇద్దరు ట్రేడర్లు, మరో 14 మంది ఉంటారు. పాలక వర్గం పదవీ కాలం రెండేళ్లు ఉంటుంది.

రూ.1.50లక్షల ఆర్థిక సహాయం



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న కేజీకేఎస్ ప్రతినిధులు

చేర్యాల(సిద్దిపేట): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మెరిండ్ల శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఆ సంఘం నేతలు రూ.1.50లక్షల ఆర్థిక సహాయం అందించారు. సోమవారం ముస్త్యాలలో నిర్వహించిన శ్రీనివాస్ సంతాపసభకు హాజరైన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీనివాస్ గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేశాడన్నారు. పట్టురైతుల సంఘం రూ.60వేలు, కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లాకమిటీ నేతలు రూ.50వేలు అందజేశారు. కార్యక్రమంలో అరుణ్, వెంకటేశ్వర్లు, కొమురయ్య, రమేష్, గోపి, ఆశన్న, వెంకటమల్లయ్య, తిరుపతి, లింగం, నర్సింహులు, బాల్‌నారాయణ, వెంకట్‌మావో, ఐలయ్య, నర్సింహులు, చంద్రమజుందార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మా.. కరుణించమ్మా..



జల్లకడువలతో వెళ్తున్న మహిళలు

మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. పండుగలో భాగంలో రెండోరోజైన సోమవారం పుట్ట కమ్ముట కార్యక్రమానికి మహిళలు అధికసంఖ్యలో జల్లకడువలతో తరలివెళ్లారు. ఎల్లమ్మా కరుణించమ్మా అంటూ మొక్కులు చెల్లించుకున్నారు.

- చేర్యాల(సిద్దిపేట)

వర్షం కోసం 'కప్పతల్లి'ఆట



ఆట ఆడుతున్న పిల్లలు

కొండపాక(గజ్వేల్): వర్షం కురువాలంటూ కుకునూరుపల్లిలో చిన్నారులు కప్పతల్లి ఆటలు ఆడారు. కట్టెకు మధ్యలో కప్పను కట్టి కప్పతల్లీ.. కప్పతల్లీ.. కడుపునిండా నీళ్లు పొయ్యి.. అంటూ ఓ ఇంటివారిని అడిగితే వాళ్ల ఇంట్లోంచి నీళ్లతెచ్చి కట్టెను భుజాన ఎత్తుకున్న పిల్లలపై పోశారు. ఇలా చేయడం వల్ల వర్షం పడుతుందని గ్రామస్తుల నమ్మకం. పూర్వం నుంచి ఆచారంగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని పంతుల్‌తండాలో ఇటీవల బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో మృతి చెందిన కరంటోతు కవిత, స్వరూప కుటుంబ సభ్యులను సోమవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. వారి చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సహాయం అందేలా కృషిచేస్తానని భరోసా ఇచ్చారు. అలాగే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కరంటోతు రాజుకు మెరుగైన చికిత్సను అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన గొట్టె సంపత్, బ్రెయిన్ సర్జరీ చేయించుకున్న ఆర్ఎంపీ రమేశ్‌ను కలిశారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగితెలుసుకున్నారు. మంత్రి వెంట సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మాజీ సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, నాయకులు రవి, రాజు, తిరుపతి పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన ఎంపీటీసీ



రఘునందన్‌రావుకు పుస్తకాలు అందజేస్తున్న నర్సింహులు

తొగుట(దుబ్బాక): మెదక్ ఎంపీ రఘునందన్‌రావును మండల పరిధిలోని వెంకట్రావుపేట ఎంపీటీసీ కంకణాల నర్సింహులు ముదిరాజ్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీని సన్మానించడానికి పూలబోకేలకు బదులు నోట్ పుస్తకాలు, పెన్నులను అందజేశారు.

ఎన్నికల విధుల డబ్బులు చెల్లించాలి



మాట్లాడుతున్న రమేశ్

నారాయణఖేడ్: ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు డబ్బులు చెల్లించాలని నారాయణఖేడ్ డివిజన్ సీఐటీయూ నాయకుడు నల్లవల్లి రమేశ్ డిమాండ్ చేశారు. ఆ సంఘం కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. ఎన్నికల సమయంలో మున్సిపల్, ఆశావర్కర్లు విధులు నిర్వర్తించారని తెలిపారు. కానీ.. ఇప్పటి వరకూ రెవెన్యూ అధికారులు డబ్బులు చెల్లించకపోవడం విచారకరమని వాపోయారు. తక్కువ వేతనంతో ఇబ్బందులు పడుతున్న వీరికి ఎన్నికల విధుల డబ్బులను వెంటనే చెల్లించాలని కోరారు. నాయకులు సతీశ్, పవన్, సంతోష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు విమర్శించే అర్హతలేదు

చిన్నకోడూరు(సిద్దిపేట): మెదక్ ఎంపీ రఘునందన్ రావును విమర్శించే అర్హత బీఆర్ఎస్ నాయకులకు లేదని బీజేవైఎం మండల అధ్యక్షుడు మాతంగి నాగరాజు మండిపడ్డారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అయోధ్యలో హిందువుల చిరకాల స్వప్నమైన రామాలయాన్ని నిర్మించింది బీజేపీనే కాబట్టి రాముని పేరుమీద ఓట్లు అడిగే హక్కు తమ పార్టీకి ఉందని చెప్పారు. బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలు ఓట్లతో బుద్ధిచెప్పారని ఎద్దేవా చేశారు. ఆ నాయకులు ఆలోచించుకోవాలని పేర్కొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

దుబ్బాకటౌన్: దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1986–87లో పదోతరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకుని ఆటపాటలతో సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో హెచ్ఎం రంగారెడ్డి, ఉపాధ్యాయులు లింగమూర్తి, నర్సింహచారి, విఠల్ దేవేందర్‌రెడ్డి, విద్యార్థులు శ్రీనివాస్ మల్లేశం, వీరేశం, అరుణ, విజయలక్ష్మి, నరసింహారెడ్డి, శ్రీదేవి, రామయ్య, బాలచారి, రాజిరెడ్డి తదితరులున్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బీఎస్పీ ఇన్‌చార్జిగా రవీందర్

హుస్నాబాద్: బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పచ్చిమట్ల రవీందర్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు ఓం ప్రకాశ్ సోమవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థలు, మున్సిపాలిటీ ఎన్నికల్లో పార్టీ అన్ని స్థానాల్లోను పోటీ చేస్తుందని తెలిపారు.



నియామక పత్రం అందుకుంటున్న రవీందర్

విద్యార్థినికి అభినందనలు



అనూషను సన్మానించిన ఉపాధ్యాయులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుండారం ఉన్నత పాఠశాల విద్యార్థిని కోనేటి అనూషను హెచ్‌ఎం నాగరాణి, ఉపాధ్యాయులు అభినందించారు. ఆమె సోమవారం ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైందని, ప్రతియేటా రూ.12వేలు చొప్పున నాలుగేళ్లపాటు ఈ స్కాలర్‌షిప్ వస్తుందని హెచ్‌ఎం తెలిపారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్

జిల్లావ్యాప్తంగా బక్రీద్(ఈద్ ఉల్ అజ్) పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ పండుగ త్యాగానికి ప్రతీక అని ముస్లిం పెద్దలు పేర్కొన్నారు. అలయ్ బలయ్ తీసుకుంటూ ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లింలకు రాజకీయనాయకులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు.



హుస్నాబాద్ పట్టణంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మిరుదొడ్డి(దుబ్బాక: వేడుకల్లో పాల్గొన్న కో ఆప్షన్ మెంబర్ ఎండీ అహ్మద్



గజ్వేల్‌రూరల్: బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



సిద్దిపేటజోన్: ఈద్గావద్ద శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు



మద్దూరు(హుస్నాబాద్): ఆలింగనం చేసుకుంటున్న చిన్నారులు



కోహెడ(హుస్నాబాద్): శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి పొన్నం